# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

మంగళవారం | 26 నవంబరు, 2024 | పేజీలు : 5




## తెలంగాణ అబ్బాయి... వియత్నాం అమ్మాయి

**ప్రజాపక్షం/చండూరు** : తెలంగాణ అబ్బాయి... వియత్నాం అమ్మాయి ఇద్దరు అక్కడ ఇష్టపడ్డారు తిరిగి భారత దేశం వచ్చారు. నల్లగొండ జిల్లా చండూరు మున్సిపాలిటీకి చెందిన పాంపాటి సందీప్ వియత్నాం వెళ్లారు. అక్కడ అమ్మాయిని ఇష్టపడ్డాడు. అమ్మాయితో కలిసి ఇక్కడికి వచ్చి ఇద్దరు ఇష్టపూర్తిగా సోమవారం చండూరులోని సబ్‌రిజిష్టార్ కార్యాలయంలో రిజిష్టర్ మ్యారేజ్ చేసుకున్నారు.

## కొండాపురం ఎంపి యుపిఎస్ పాఠశాలలో

# ఉపాధ్యాయుల కొరత

### 50 మంది విద్యార్థులకు ముగ్గురు టీచర్లు చదువు చెప్పేది ఎలా?

### రెండు నెలల నుండి స్కూల్‌కు ఉపాధ్యాయుడు డుమ్మా

### సమాచారం ఇవ్వకుండానే ఓరల్ డిప్యూటేషన్

### 1 నుంచి 7వ తరగతి వరకు తరగతుల నిర్వహణ




**ప్రజాపక్షం/చండూరు:** నల్లగొండ జిల్లా చండూరు మండలం కొండాపురం ఎంపి యుపిఎస్ పాఠశాలలో చదువుకోవడానికి విద్యార్థులు ఉన్న చదువు చెప్పడానికి ఉపాధ్యాయులు మాత్రం లేరు అనడానికి ఇది నిర్శనం. కొండాపురంలోని ఎంపి యుపిఎస్ పాఠశాల 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు తరగతులు నడుస్తున్నాయి. పాఠశాలలో మొత్తం 50మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 50మంది విద్యార్థులకు ప్రస్తుతం ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే విద్యను అందిస్తున్నారు. ఈ సంవత్సరం పాఠశాల ప్రారంభంలో 4గురు ఉపాధ్యాయులు ఉండేవారు. అందులో ఒకరు ఎస్ఏ సోషల్ స్టడీస్ కాగ మిగతా ముగ్గురు ఎస్‌జిటిలు విద్యార్థులకు పాఠాలు చెప్పుతున్నారు. పాఠశాలలో గణితం , తెలుగు, హిందీ , ఇంగ్లీష్ ,సైన్స్ బోదించే ఉపాధ్యాయులు లేరు.అయిన ఎస్‌జిటిలు 7వ తరగతి వరకు విద్యను అందిస్తున్నారు. గత రెండు నెలల క్రితం నుండి స్కూల్‌లో ఎస్‌జిటిగా విధులు నిర్వహిస్తున్న వి. భగవంతరెడ్డి స్కూల్‌కు రాకుండా డుమ్మా కొడుతున్నారు. ఇట్టి సమాచారం కోసం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూతం ముత్యాలు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా రెండు నెలల నుండి స్కూల్‌కు రాకుండా విధులకు గైర్హాజర్ అవుతున్న ఉపాధ్యాయుడుని ఫోన్‌లో సంప్రదించగా మంత్రి పేరు చెప్పుతూ ఓరల్ డిప్యూటేషన్ గా నార్కట్‌పల్లి మండలం లోని ఓ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందించారు. కొండాపురం పాఠశాలలో విధులు నిర్వహిస్తూ డిఈఓ ,ఎంఈఓ, తమ పరిధిలోని కాంప్లెక్స్ పాఠశాల పుల్లెంల జిహెచ్‌ఎం ప్రధానోపాధ్యాయుడికి, కొండాపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కు ఎలాంటి లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వలేదు. ఓరల్ డిప్యూటేషన్‌పై వెళ్లిన వి.భగవంతరెడ్డిని తిరిగి కొండాపురం పాఠశాలలో విద్యార్థులకు విద్యను అందించేటట్లు చూసి తమ పిల్లల భవిష్యత్తును కాపాడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## హర హర మహాదేవ...

# శంభో శంకర



### చెరువుగట్టులో కిక్కిరిసిన భక్తులు

### ఆఖరి సోమవారంతో అధిక సంఖ్యలో భక్తుల పూజలు

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** శివునికి అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసం లో ఆఖరి సోమవారం కావడంతో శివ భక్తులు శివాలయాలలో కికిరిసిపోయారు. జిల్లాలో అత్యంత ప్రాముఖ్యత గల చెరువుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవాలయం లో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు విచ్చేశారు. మహిళలు కార్తీకదీపం ఘనంగా నిర్వహించుకున్నారు. గుట్టకు భక్తుల తాకిడి అధికమవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. ఆలయ ప్రధాన అర్చకులు పోతులేటి రామలింగేశ్వర శర్మ సమక్షంలో స్వామివారిని రకరకాల పూలతో ప్రత్యేక అలంకరణ తీర్చిదిద్దారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. కార్తీక మాసం ఆఖరి సోమవారం కావడంతో జిల్లాలోని విఐపిలు స్వామి వారిని దర్శించుకుని ధన్యులైనారు. స్వామి వారి దర్శనానికి భక్తులు బారు తీరి సుమారు రెండు గంటల పాటు లైన్ లోనే వేచి ఉన్నారు. అదేవిధంగా భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు.



## ఇవిఎంల నుండి బ్యాలెట్‌కు మారాలి

### ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భువనగిరి :** ఇవిఎం మిషన్‌లతో కాకుండా బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు నిర్వహించాలని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్లమెంటు సమావేశాల్లో పాల్గొనడానికి డిల్లీ వెళ్లిన చామల కిరణ్ కుమార్ రెడ్డి ఒక పత్రికకు సోమవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ప్రజల నాడి ఒకలా ఉంటే ఫలితాలు మాత్రం మరోలా వస్తుండడంతో రాజకీయ నాయకులు ఆశ్చర్యానికి గురై ఎన్నికల ప్రక్రియ పైనే అనుమానాలు వ్యక్తం చేస్తే స్థాయికి చేరిందన్నారు. ప్రపంచంలోని ఎన్నో దేశాలు ఈవిఎంను వదిలి బ్యాలెట్ పేపర్‌తోనే ఎన్నికలు నిర్వహిస్తున్నాయని ఆయన తెలియజేశారు. ఏదో రకంగా గెలిచేందుకు భారతీయ జనతా పార్టీ చేస్తున్న కుట్రల్లో భాగంగా ఈవిఎంలు కూడా బాగస్వామ్యమవుతున్నాయని ఆయన విమర్శించారు. ఇందుకు హర్యాణ, మహారాష్ట్రల్లోని ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. ఎక్జిట్ పోల్స్, ప్రజానాడి ఒకలా ఉంటే ఫలితాలు మరోలా ఉండడంతో సర్వత్రా ఈవిఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, ఇప్పటికైన ఎన్నికల సంఘం ఈవిఎంలతో ఎన్నికల నిర్వహణపై పునరాలోచించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రపంచ దేశాల్లో ఈవిఎంల నుండి సాధారణ బ్యాలెట్ పత్రాలతో ఎన్నికల నిర్వహణపై లోతుగా అధ్యయనం చేసి భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు.

## కలెక్టరే టీచరైన వేళ..!

### బొమ్మలరామారం హైస్కూల్‌ను ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** కలెక్టరే కాకుండా విద్యార్థులకు పాఠాలు బోధించిన యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు. బొమ్మలరామారం మండల జిల్లా పరిషత్ హై స్కూల్‌ని సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు.తరగతి గదిని సందర్శించారు. స్వయంగా విద్యార్థులకు గణిత, ఇంగ్లీష్ పాఠాలు బోధించి విద్యార్థులను ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. తరగతుల వారీగా హాజరు శాతం ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. సబ్జెక్టుల వారీగా మెరుగైన విద్యా బోధన అందజేయాలన్నారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహించాలన్నారు.



## రోడ్డు ప్రమాదంలో జార్ఖండ్ వాసి మృతి

**ప్రజాపక్షం/అడ్డగూడూరు:** గత కొన్ని రోజులుగా గురజాల చౌళ్లరామారం గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణ పనులు జరుగుచున్నవి. ఈ రోడ్డు నిర్మాణ పనుల్లో హిట్టాచ్ మిషన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన పింటూ సావ్ తండ్రి గులాబ్ సాబ్(30) అనే వ్యక్తి ఆదివారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో తన బైక్ పై వెళ్తూ అడ్డగూడూరు గ్రామ శివారులో అదుపుతప్పి ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న గుంత లో పడి తలకి బలమైన గాయం కావడం వల్ల అక్కడికక్కడే మరణించినాడు. ఇట్టి విషయం చుట్టుపక్కల వ్యవసాయ భూములు గల రైతులు చూసి పోలీసు వారికి సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ మండల పరిధిలోని బూరుగడ్డలో వేంచేసిన శాల్మలీకంద ఆదివరహాలక్ష్మీ నృసింహా వేణుగోపాల స్వామి ఆలయంలో కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా అర్చకులు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా ఆలయ ధర్మకర్తలు, భక్తులు సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతం కార్యక్రమాన్ని నిర్వహించారు. గోదాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యరగాని గురవయ్య గౌడ్, ధర్మకర్తలు గంధం అంజయ్య,తిపిరిశెట్టి హరీష్‌కుమార్,మెరిగ కవిత,వేముల నరసింహారావు,కోల కృష్ణప్రసాద్, పెనుబెల్లి హనుమంతరావు,ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంపి. లక్ష్మణ్ రావు,ఆలయ అర్చకులు ముదుంబై హరీష్ కుమారాచార్యులు,శ్రీనివాసాచార్యులు,తిపిరిశెట్టి ప్రభాకర్,యరగాని పూర్ణ,యరగాని గువయ్య,తిపిరిశెట్టి నవీన్,శివశంకర్, ముదుంబై లక్ష్మి,అనసూర్యమ్మ,పుష్పలత, సక్కుబాయమ్మ పాల్గొన్నారు.

## చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/పాలకవీడు:** భారీనిటీపారుదల,పౌరసరఫరాల శాఖామాత్యులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో లబ్ధిదారులకు మంజూరైన సిఎమ్ఆర్ఎఫ్ చెక్కులను తహశీల్దార్ కమలాకర్ అందజేశారు. సోమవారం పాలకవీడు మండల పరిధిలోని బెట్టెతండాలో ఇరువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మోతీలాల్ నాయక్,కార్యదర్శి శివకృష్ణ,నగేష్,శ్రీను,కిషన్,వినోద్,అశోక్,నాగేశ్వరరావు,సురేష్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభంపై నుండి వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/పెన్‌పహడ్:** పెన్‌పహడ్ మండల కేంద్రానికి చెందిన ఒగ్గు బిక్షం ఆదివారం సాయంత్రం తన వ్యవసాయ భూమిలోని కరెంట్ స్తంభంకు పై ఉన్న జంపర్ వైర్‌ను కలపడానికి స్తంభంను ఎక్కగా ప్రమాదవశాత్తు జారి కిందపడిపోగా తలకు, చేతులకు, ఇతర భాగాలకు బలమైన గాయాలు కావడంతో రక్తం పూర్తిగా పోవడం వల్ల తీవ్ర రక్తపు గాయాలయ్యాయి. వెంటనే 108లో సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. మృతుని భార్య వగ్గు శైలజ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపికృష్ణ తెలిపారు.

## విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు కావాలి



**ప్రజాపక్షం/భువనగిరి :** మా ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు కావాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ నల్ల నరేందర్ మహారాజ్ డిమాండ్ చేశారు. సోమవారం ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రిన్స్ కార్నర్ వద్ద విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు కావాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. నినాదాలు చేస్తూ రోడ్డుపై బైటయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికి విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు ఇవ్వాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రిప్రసెంటేషన్ ఇచ్చినప్పటికీ ఎలాంటి స్పందన లేనందున ధర్నా నిర్వహించడం జరిగిందని తెలిపారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆమరణ నిరాహారదీక్షకు సైతం పునుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వినోద్ యాదవ్, సామాజికవేత్త బట్టు రాంచంద్రయ్య, జిల్లా నాయకులు శ్రీను యాదవ్, లింగస్వామి మహారాజ్, నర్సింగ్ మహరాజ్, శ్రీకాంత్ మహారాజ్, మహేష్ మహారాజ్, స్వామి మహారాజ్, రవి మహారాజ్, అశోక్, నరేందర్, శాంతి కుమార్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు

**ప్రజాపక్షం/ రామన్నపేట:** చిన్నారులు సామాజిక బాధ్యతను, సాహిత్య దృక్పదాన్ని చిన్నతనం నుంచే అలవరుచుకోని భవిష్యత్తులో సన్మార్గంలో నడపాలని అఖిల భారత లాయర్స్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి అన్నారు. భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం మునిపంపుల ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా నవంబర్ 14 నుంచి 24 వరకు నిర్వహించిన పిల్లల పండుగ సాహితి సాంసృతిక పోటీల్లో భాగంగా బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో స్థానిక భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. చిన్నారి గంటెపాక శ్రేష్ఠ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పిల్లలకు సాహిత, సంస్కృతిక పోటీల్లో ప్రతిభను వెలికితీసేందుకు సామాజిక బాధ్యతను గుర్తించేందుకు ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆటపాట, నృత్యాలు, చిత్రలేఖనం,




వ్యాసరచన పోటీల్లో 110 మంది విద్యార్థులో పాల్గొన్నారు. పలువురు విద్యార్థులు ఆయా వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెలిమినేటి మల్లేశం, మేడి మధుబాబు, గంటెపాక ముత్యాలు, తొలుపునూరి చంద్రశేఖర్, బొడ్డుపల్లి వెంకటేశం, గంటెపాక శివకుమార్, నోముల రమేష్, తొలుపునూరి శ్రీనివాస్, జంపాల ఆండాలు, తాళ్లపల్లి జితేందర్ పాల్గొన్నారు.

## నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలి



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** వామపక్ష రైతుసంఘాలు,పట్టణ,గ్రామీణ కార్మీక సంఘాలు,వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నేడు సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరగనున్న బైక్‌ర్యాలీని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మికసంఘం సూర్యాపేట జిల్లా ప్రధానకార్యదర్శి ధూళిపాళ ధనుంజయ్ నాయుడు పిలుపునిచ్చారు. సోమవారం నేరేడుచర్ల మండలపరిధిలోని కల్లూరు గ్రామంలో వ్యవసాయ కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను కొనసాగిస్తుందని, ఆ విధానాలను ప్రతిఘటించేందుకు యావత్ ప్రజానికం ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. అన్ని పంటలకు మద్దతుధర అమలు చేయాలని,రుణమాఫీ చట్టం చేయాలని అనేక సంవత్సరాలుగా రైతులు పోరాడుతున్నప్పటికీ ప్రభుత్వాలు మార్పులు చేయడం లేదని,వ్యవసాయాన్ని కార్పోరేట్ చేయడానికి తీసుకువస్తున్న డిజిటల్ వ్యవసాయ మిషన్ జాతీయ సహకార విధానములో భాగంగా ఐసిఎఆర్,కార్పోరేట్ కంపెనీలతో జరిగిన వ్యవసాయ పరిశోధనల ఒప్పందాలను రద్దుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం,వ్యవసాయ కార్మికసంఘం నాయకులు సద్దల నాగనాజు,వీరస్వామి పాల్గొన్నారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇఎస్ఐ, పిఎఫ్ వర్తింపచేయాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెనకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలలో పనిచేయడానికి 2018 వ సంవత్సరంలో అవుట్‌సోర్సింగ్ ద్వారా తీసుకున్న ఉద్యోగులకు,సిబ్బందికి కూడా ఈఎస్ఐ,పిఎఫ్‌లను వర్తింపచేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని గరిడేపల్లి మండల కేంద్రంలో జరిగిన ఏఐటీయూసీ మండల కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 2018లో ఎమ్‌జిఆర్ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా 27 మందిని బిసి వెల్ఫేర్ హాస్టల్స్‌లో పనిచేయడానికి రిక్రూట్‌మెంట్ చేసుకున్న నాటి నుండి ఫిబ్రవరి వరకు జీతంతో కలిపి పిఎఫ్ ఇచ్చినారని, ఆ తర్వాత నుండి పిఎఫ్, ఈఎస్ఐ ఇవ్వడంలేదని తెలిపారు. ఏజెన్సీ మారిన తర్వాత పిఎఫ్, ఈఎస్ఐ కట్ చేయడం సరైంది



కాదని, గతంలో మాదిరిగా వారికి రెగ్యూలర్‌గా పిఎఫ్,ఈఎస్ఐలను జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కడియాల అప్పయ్య, కుందూరు వెంకటరెడ్డి,తాళ్ల తిరపయ్య,పోకల ఆంజనేయులు,షేక్.నబిసాహెబ్,గోదుమల ఈశ్వరచారి,వెంకటేశ్వర్లు, అచ్చయ్య,షేక్.పీర్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత పశువైద్య శిబిరం

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని నీర్నెముల గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాదుల చికిత్స శిబిరం నిర్వహించారు. తొలుత కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మించిన దూడులను ప్రదర్శించి ఈ శిబిరం ద్వారా ఎదకురాని పశువులకు పరీక్ష చేసి చికిత్స చర్యలు చేపట్టడం, చూడి పరీక్షలు చేయడం అలాగే పశువుల్లో వివిధ రకాల గర్భకోశ సంబంధిత వ్యాదులను గుర్తించి చికిత్స చేయడం జరిగింది. తదుపరి 31 దూడలకు నట్టల నివారణ మందులను తాపించడమైంది. అదేవిధంగా 156 పశువులకు గాలికుంటు వ్యాది నివారణ టీకాలు వేయడమైంది. కార్యక్రమంలో పశువైద్య శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఇందిరా, ప్రాధమిక పశువైద్య కేంద్రం వైద్యులు డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ వెంకటేష్, డీఎల్‌డీఏ పర్యవేక్షకుడు మహేష్, సహాయకులు భానుచందర్, మౌనిక, గోపాలమిత్రలు సురేష్,మల్లేష్ పాల్గొన్నారు.

## శంభులింగేశ్వరస్వామి కళ్యాణం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ లో వేంచేసిన నల్లకట్ట సంతాన కామేశ్వరీ సమేత శంభులింగేశ్వరస్వామి కళ్యాణం అత్యంత వైభవంగా సోమవారం జరిగింది. అర్చక స్వాములు వేదమంత్రోచ్ఛరణలతో సంతాన కామేశ్వరీ సమేత శంభులింగేశ్వరస్వామి కళ్యాణం అశేష భక్తుల నడుమ నిర్వహించారు. ఆలయ ప్రాంగణం అంతా శివన్మాస్మరణలతో మార్మోగాయి. ఈ సందర్భంగా భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, డా.యరగాని నాగన్న గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్,మాజీ ఎంపిపి గూడెపు శ్రీనివాస్‌లు ప్రారంభించారు. అంతకుముందు వారికి ఆలయ కమిటీ చైర్మన్ చిమట సైదులు యాదవ్,అర్చకులు రవికుమార్‌తో కలిసి స్వామివారి శేష వస్త్రాలతో ఘనంగా సత్కరించారు. భక్తులకు అర్చకులు తీర్ధప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతకాయల రాము, యరగాని భిక్షం,యరగాని నరసింహారావు,యరగాని సైదులు,రాగం నాగయ్య,దీవెన వెంకన్న,బాలబోయిన అంజయ్య భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.1000 పెన్షన్ పథకాన్ని అమలు చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నెలకు 1000 పెన్షన్ పథకాన్ని వెంటనే అమలు చేయాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పేర్ల నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సూర్యాపేట తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటి తహసిల్దార్ పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రంను అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో గెలవడం కోసం ప్రజలకు అనేక రకాల వాగ్దానాలు చేసిందని, అందులో భాగంగా వ్యవసాయ కార్మికులకు నెలకు 1000 పెన్షన్ పథకాన్ని సంవత్సరం కావాస్తున్న ఇంత వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో గొడ్డలి నర్సయ్య, గులాం హుస్సేన్, మోహన్, శ్రీరామ్, ఉపేందర్, పాల్వాయి రవి తదితరులు పాల్గొన్నారు.





## ప్రతీ గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది

**ప్రజాపక్షం/మోతె:** రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని తహసిల్దార్ సంఘమిత్ర అన్నారు. సోమవారం మండలంలోని విభాలపురం గ్రామంలో మహిళ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలోని సన్నవడ్లకు అమ్మితే 500రూపాయల బోనస్ పొందాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కాంటాలు ఉండాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం వెంకయ్య, ఎఇవో రేష్మా, సిసి శ్రీను, మహిళా సంఘాలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కొమురం భీమ్ అవార్డు



**ప్రజాపక్షం/చండూరు:** మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం 93వ జయంతి ,సర్దార్ వల్లభాయ్ పటేల్ 149 జయంతిని పురష్కరించుకొని అందించే పురస్కారాలు ఎస్.సరోజనమ్మ అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకురాలు ఆద్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించి అట్టి అవార్డుకు ఎంపికైన చండూరు వాసి రచయిత ఐదరి నాగిళ్ల శంకర్‌కు అవార్డును అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అభిలాష సంస్థ ఫౌండర్ చైర్మన్ శ్రీమతి సరోజనమ్మ, ఖాదర్‌పాషా, సతీష్ , శివలీల, లక్ష్మీ బాయ్ సునీత,తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 9నుండి సమగ్ర సర్వే

**ప్రజాపక్షం/గుండాల:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు గుండాల మండలంలో డిసెంబర్ 9 నుండి సమగ్ర ఇంటింటి సర్వే నిర్వహించడం జరుగుతుందని ఎంపిడివో తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వే 98శాతం పూర్తి అయిన నేపథ్యంలో మండలంలోని కొన్ని గ్రామాలలో ఎవరైనా సర్వే నిర్వహణకు సంబంధించిన అధికారులు మీ వద్దకు రాకున్నా, కుటుంబ సభ్యులు అందుబాటులో లేకున్న, ఇంటికి తాళం వేసున్నా సర్వేలో నమోదు కాని కుటుంబాలు సర్వేను పూర్తి చేసే విధంగా సర్వేకు సహకరించాలని కోరారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నోడల్ అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదించాలని పూర్తి వివరాలకు 9398990013కి సంప్రదించాలని ఆయన తెలిపారు.

## మనోహర్‌రెడ్డికి సన్మానం



**ప్రజాపక్షం/చండూరు:** ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో డివోలి అసెంబ్లీ నియోజకవర్గం బిజెపి ఎంఎల్‌ఎ అభ్యర్ధి గెలుపు కోసం కృషి చేసిన బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డిని ఆదివారం చండూరు మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు పందుల సత్యంగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఓబిసి మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి కోమటి వీరేశం , సింగిల్ విండో డైరెక్టర్ బోడ ఆంజనేయులు పాల్గొన్నారు

## ప్రతి గ్రామం, తండాకు బిటిరోడ్డు నిర్మాణం



**ప్రజాపక్షం/డిండి :** నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి, తండాకు బీటి రోడ్డు నిర్మాణం చేపడతామని దేవరకొండ ఎంఎల్‌ఎ నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం డిండి మండలంలో నిర్మాణంలో భాగంగా పనులు జరుగుతున్న బీటి రోడ్ల పనులు ఎంఎల్‌ఎ బాలునాయక్ పరిశీలించారు. కాంట్రాక్టర్లు నాణ్యమైన రోడ్డు పనులను చేపట్టకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్లకు సూచించారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. నిర్మాణ పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌యాదవ్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి బొల్లే శైలేష్, నాయకులు దామోదర్, రాంకిరణ్, రేఖ్య, లోక్య, లక్ష్మణ్, తేజు, సాయి, వెంకట్రాం, ఆనంద్‌రెడ్డి, మహమ్మద్ అలి, ఎంపిడివో వెంకన్న, కాంట్రాక్టర్ వెంకన్న, ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## వరిలో డ్రమ్‌సీడర్ ద్వారా అధిక దిగుబడులు



ప్రజాపక్షం/పెన్‌పహడ్: వరిలో నేరుగా విత్తే విధానం ద్వారా పండించిన వరి పంటను డ్రమ్ సీడర్ ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని కెవికె గడ్డిపల్లి శాస్త్రవేత్త ఎ.కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని దూపహడ్, లింగాల గ్రామాల్లో వరిలో నేరుగా విత్తే విధానం ద్వారా పండించిన పంటను ఆయన పరిశీలించారు. వరిలో చిన్న ట్రాక్టర్లు యాంత్రీకరణ ద్వారా వరి విత్తనం విత్తనట్లయితే దిగుబడి పెరుగుతుందని, బూమ్ స్ప్రేయర్ ద్వారా కలుపు మందులు, చీడపీడల సమస్యలకు రసాయనాలు పిచికారి చేయడం ద్వారా రైతులకు కూలీల సమస్య తగ్గి సరైన సమయంలో పంటలను పండించి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ యాసంగిలో కెవికె గడ్డిపల్లి ద్వారా ఎంపిక చేసిన 15 మంది రైతులకు ఈ చిన్న ట్రాక్టర్ల ద్వారా బురదనేలలో వరి విత్తనం, వేద పెట్టడం కార్యక్రమాలు జరుపుతామని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పుండరీకాంక్షుడు, రైతులు డి.అరవింద్, ఎం.వీరయ్య, బచ్చు శ్రీను, అంజయ్య, సత్యనారాయణ, మల్లారెడ్డి, విద్యార్థులు కె. డెలీనా, కె.స్నేహ, లలిత, ఎ.గీతిక, కీర్తన, దుర్గ పాల్గొన్నారు.

## వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** మాజీ జెడ్పిటిసి సలహాదారుడు పసునూరి యుగేందర్‌రెడ్డి స్వామి రేష్మి దంపతులు ఆదివారం రాత్రి కొండమల్లేపల్లి పట్టణంలోని వారి స్వగృహంలో అయ్యప్ప స్వామి మహా పడి పూజను ఎంతో వైభవంగా, కన్నుల పండువగా జరిపించారు. చిట్టెడి ప్రభాకర్‌రెడ్డి గురుస్వామి, దేరం జయప్రకాశ్ శర్మలు అయ్యప్ప స్వామి విగ్రహానికి పంచామృత అభిషేకం నిర్వహించారు. గణపతి, కుమార స్వామి మెట్ల పూజను నిర్వహించారు. పదునెట్టాంబడి ప్రత్యేక పూజలను అయ్యప్ప స్వాములతో కలిసి నిర్వహించారు. అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున మహాపడి పూజలో పాల్గొని భక్తి పారవశ్యంతో పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి పసునూరి సరస్వతమ్మ, పసునూరి కరుణ వెంకటేశ్వర్‌రెడ్డి, ఊట్కురి వేమన్‌రెడ్డి స్వామి, తోటపల్లి శ్రీను స్వామి, కందుల వెంకట్‌రెడ్డి స్వామి, ఇమ్మడి శ్రీను స్వామి, బోడ అశోక్ స్వామి, జయశంకర్, గణేష్ స్వాములు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో లావూరి బాలు అన్నారు. సోమవారం మిర్యాలగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వాహకులు క్వాలిటీతో కూడిన సరుకులతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలని లేనట్లయితే చర్యలు తప్పవన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎప్పటికప్పుడు మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





## ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం పెద్దపడిశాల గ్రామానికి చెందిన పార్టీ సినియర్ కార్యకర్త, గ్రామ పంచాయతీ కార్మికుడు అల్లే బిక్షమయ్య అనారోగ్యంతో సోమవారం మరణించడం జరిగింది. విషయం తెలుకున్న కాంగ్రెస్‌గ్రామ శాఖ అధ్యక్షులు ఆకుల ఆంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం మృతుని కుటుంబానికి రూ. 10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి విశాలక్ష్మీ, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షులు ఆకుల ఉదయ్, మాజీ వార్డు సభ్యులు కుమార్, మహేందర్, బాలమల్లు, ఉపాధ్యక్షులు ముత్తయ్య పాల్గొన్నారు.

## నేడు కార్మిక సంఘాల నిరసన

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26న అన్ని పట్టణ, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చి కార్మికులను ఇబ్బందులకు గురి చేయాలని చూస్తుందన్నారు. కార్మిక, కర్షక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు బలమైన ఉద్యమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎండి.సయిద్, మల్లు గౌతంరెడ్డి, చాంద్‌పాషా, రామ్మూర్తి, ముదిరెడ్డి నర్సిరెడ్డి, వెంకన్న తదతరులు ఉన్నారు.

## గ్రామీణ కళా కోలాటం నేర్చుకోవడం అభినందనీయం



**ప్రజాపక్షం/నూతన్‌కల్:** గ్రామీణ ప్రాంతాల్లో అంతరించిపోతున్న కోలాట కళలు, మహిళలు నేర్చుకోవడం అభినందనీయమని డిసిసి కార్యదర్శి గుగులోతు కృష్ణనాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బక్కహేమ్లాతండా గ్రామ పంచాయతీ అవాసమైన మాన్సింగ్‌తండాకు చెందిన మహిళలకు తన సొంత ఖర్చులతో కోలాట కళను నేర్పించారు. శ్రీ ఆంజనేయ సోసైటీ సభ్యులతో కలిసి మహిళలకు కోలాట సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సోసైటీ అధ్యక్షులు పి.బాలు, కార్యదర్శి నాగు, సభ్యులు దామోదర్‌నాయక్, బల్సింగ్, నాగు, నరేష్, శ్రీకాంత్, జలేందర్, రమేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సిసి కెమెరాలు ప్రారంభం షురు



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ఒక్క సిసి కెమెరా వంద కళ్లలాంటివని, సిసి కెమెరాల వల్ల దొంగతనాల నివారణకు సులువుగా ఉంటుందని సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని 60ఫీట్ రోడ్డు నందు కమ్యూనిటి పోలిసింగ్‌లో సిసి కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే తప్పని సరిగా దొంగతనాల నివారణ చేపట్టవచ్చని అన్నారు. ఈకార్యక్రమంలో ఎఎస్పీ నాగేశ్వరరావు, డిఎస్పీ రవి, పట్టణ సిఐ రాజశేఖర్, విద్యా సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా సయ్యద్




**ప్రజాపక్షం/సూర్యాపేట:** తెలంగాణ స్పోర్ట్స్ కరాటేడు అసోసియేషన్ టిఎస్ కెడిఎ రాష్ట్ర అధ్యక్షులు టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ బి.మహేష్‌కుమార్ గౌడ్ అదేశానుసారం సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన స్పోర్ట్స్ కరాటేఏడో అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఖమ్మం జిల్లా వైస్ చైర్మన్ మహ్మద్‌గఫూర్ ముఖ్య అతిధిగా హాజరై నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ ఎం.రవిబాబు, ఉపాధ్యక్షులుగా షేక్ తాహీర్‌పాషా, లీగల్ అడ్వజర్‌గా జి.అశోక్, ప్రధాన కార్యదర్శిగా షేక్ సయ్యద్ కాసీం, జాయింట్ సెక్రటరీగా ఎస్‌డి రియాజుద్దీన్, మాదవిలత, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రామాంజీరెడ్డి, సైదులు, బి.విజయ్, ముఫ్తి ఆశ్రార్ లు ఎన్నికయ్యారు. వివిధ మం డలాలకు చెందిన మాస్టర్స్‌ని కమిటి సభ్యులుగా నియమించారు.

## బస్వాపురానికి ఎస్‌సి రిజర్వేషన్ వినతి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి మండలం బస్వాపురం గ్రామంలో గత 70 సంవత్సరాల నుంచి ఇంతవరకు ఎస్సీకి రిజర్వేషన్ రాలేదు ప్రస్తుతం వస్తున్న ఎన్నికలో సర్పంచ్‌కు ఎస్సీ రిజర్వేషన్ కేటాయించాలని కోరుతూ సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ గంగాధర్‌కు బస్వాపురం ఎస్సీ కాలనీ యూత్ ప్రెసిడెంట్ అన్నంపట్ల బాలస్వామి వినతి పత్రం అందజేశారు. ఇప్పటిదాకా పరిపాలించిన వారిలో ఒక్క 35 సంవత్సరాలు రెడ్డిలు 25 సంవత్సరాలు బీసీలు పరిపాలించారని పేర్కొన్నారు. కనీసం ఎస్సీకి ఇంతవరకు సర్పంచ్ కానీ ఎంపీటీసీ ఈ 70 ఏళ్ల చరిత్రలో ఇంతవరకు ఎస్సీ రిజర్వేషన్ రాలేదని ఈ ఎన్నికలలో కచ్చితంగా బస్వాపురం గ్రామానికి ఎస్సీ రిజర్వేషన్ ఇవ్వాలని కోరారు.

## గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యం



**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** గ్రామాలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేష్ పైలెట్ అన్నారు. మండలంలోని లక్ష్మీ తండా గ్రామపంచాయతీ పరిధిలోని దేవుని తండా, బుక్య తండాలో సోమవారం 30 ఎల్‌ఈడి లైట్లును ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో తండాలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేద ప్రజల ప్రభుత్వమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సింగిర్తి మల్లేశం, మండల ఎస్టిసెల్ అధ్యక్షులు నరసింహ్మా నాయక్, గ్రామ శాఖ అధ్యక్షులు బలరాం నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## బియ్యం పంపిణీ

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూర్ మండలంలోని ఇక్కుర్తిలో ఐలి పుల్లయ్య ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సూదగాని హరిశంకర్ గౌడ్ సహకారంతో ఇక్కుర్తి బిఆర్ఎస్ నాయకులు ప్రగాఢ సానుభూతి తెలియచేసి కుటుంబ సభ్యులకు 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చొప్పరి మొగులయ్య, మండల ఎస్సీసెల్ అధ్యక్షులు బోడ మహేష్, ఇక్కుర్తి యువజన విభాగం అధ్యక్షులు నరేష్ కుమార్, నాయకులు అయిలి రవీందర్, మంచ ఉపేందర్, దాసరి నాగరాజు, పోతగాని రవి, చామకూర అంజిరెడ్డి, రవీందర్ రెడ్డి, దాసరి వెంకటేష్, అయిలి వెంకటేష్, రవి, గాదం నాగరాజు, సీస ఉపేందర్, ఓరుగంటి నరేష్, చామకూర రంగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కరీంనగర్ పాదయాత్రకు వేలాదిగా తరలిరావాలి



**ప్రజాపక్షం/వలిగొండ :** ఈనెల 27, 28వ తేదీలలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో కరీంనగర్ నుండి వేములవాడ వరకు నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల విజయ సంకల్ప మహా పాద యాత్రలో తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారులు వేలాదిగా తరలివచ్చి ఉద్యమకారుల ఐక్యతను చాటాలని ఉద్యమకారుల పోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు పరచాలని, తెలంగాణ ఉద్యమకారుల పోరం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ పిలుపులో భాగంగా విజయ సంకల్ప మహా పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు తెలంగాణ సంస్కృతి సారథిలో 1000 ఉద్యోగాలు కల్పించాలని, ప్రభుత్వం సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని, తెలంగాణ ఉద్యమకారులను తెలంగాణ స్వతంత్ర సమర యోధులుగా గుర్తించి 25 వేల రూపాయల పెన్షన్ అందించాలని, అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో ఉద్యమకారులకు, ఉద్యమ కళాకారులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఉద్యమ వృద్ధ కళాకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. కరీంనగర్ నుండి వేములవాడ వరకు జరిగే మహాపాదయాత్రను విజయవంతం చేయడానికి వేలాదిగా తరలిరావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో కన్వీనర్ శీలం స్వామి, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గంధమల్ల బాలయ్య, మండల అధ్యక్షులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధర చెల్లించాలి



**ప్రజాపక్షం/భూధాన్ పోచంపల్లి:** మండలంలోని 10 గ్రామాల్లోని 229 ఎకరాల సాగు భూమిలో నిర్మాణం చేస్తున్న గౌరెల్లి భద్రాచలం రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు భూమికి బదులు భూమి లేదా ఓపెన్ మార్కెట్లో ఉన్న ధరనైనా ప్రభుత్వం చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పోచంపల్లి పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సమావేశం మండల కార్యదర్శి వర్గ సభ్యులు ప్రసాదం విష్ణు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ అనేక వందల సంవత్సరాల నుండి భూమిని నమ్ముకుని జీవిస్తున్న పోచంపల్లి పరిధిలోని వివిధ గ్రామాల రైతులు సాగు చేస్తూ జీవిస్తున్నారని సదరు రైతులు భూమి కోల్పోయి నిరాశ్రయులయ్యారని అన్నారు. అనంతరం భూములు కోల్పోతున్న పిల్లాయిపల్లి రైతులతో కలిసి మండల డిప్యూటీ తహశీల్దార్ కు మెమొరండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు మంచాల మధు, గూడూరు బుచ్చిరెడ్డి, మండల కమిటీ సభ్యులు నెలకంటి జంగయ్య, నోముల కృష్ణారెడ్డి, బోయపల్లి పుష్పలత, నాయకులు మల్లారెడ్డి వీరారెడ్డి, అందేలా హరీష్, కిష్టయ్య ,నరేందర్ రెడ్డి, యాదయ్య, ప్రసన్న, నరసింహ, పర్వతాలు, సాయిలు పాల్గొన్నారు.

## డేటా ఎంట్రీలో ఖచ్చితమైన సమాచారం నమోదు



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీని డేటా ఎంట్రీలో ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలి, ఎంట్రీని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో ఝాన్సీ లక్ష్మి బాయి సంబంధిత సిబ్బందికి సూచించారు. సోమవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న డేటా ఎంట్రీని పరిశీలించి మాట్లాడుతూ 40 కంప్యూటర్ల ద్వారా డేటా ఎంట్రీని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డేటా ఆపరేటర్స్ ఎలాంటి తప్పులు లేకుండా ఎన్యుమరేటర్స్ సహకారంతో ఖచ్చితమైన సమాచారాన్ని కంప్యూటర్లో నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఈనెల 25,26తో ముగుస్తుందని తెలిపారు. ఇప్పటివరకు సర్వే చేయించుకొని వారు సంబంధిత గ్రామపంచాయతీ, ఎంపీడీవో కార్యాలయాన్ని సంప్రదించి సర్వే చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, ఎంపీఓ వెంకటేశ్వర్లు, సూపరింటెంట్ జే.వినోద్ రెడ్డి, మాస్టర్ ట్రైనర్ అశోక్, శ్రీనివాస్, ఏఈలు అనంతరెడ్డి, మనోహర్ బాబు, ఏవో ఉమాశ్రీ, డిప్యూటీ తహసిల్దార్ కల్పన ,ఆర్ఐ జహంగీర్, కంప్యూటర్ డేటా ఆపరేటర్స్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థిగా పన్నాల గోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** వరంగల్,ఖమ్మం,నల్లగొండ ఉపాధ్యాయ ఎంఎల్ సి అభ్యర్థిగా పన్నాల గోపాల్ రెడ్డిని పోటీలో నిలబెట్టాలని స్పెషల్ టీచర్స్, పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు రాష్ట్ర ప్రధానకార్యదర్శి బెలిజిని కోటయ్య, సహాధ్యక్షులు జోగు భికపతి,గౌరవాధ్యక్షులు ముత్తారం నరసింహస్వామి, ట్రెజరర్ పి. పెద్దన్న తెలిపారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో 1983 నుండి 1996 వరకు మధ్యకాలంలో కేవలం 398 రూపాయల వేతనముతో పనిచేసిన స్పెషల్ టీచర్లకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలుగా ఏర్పడిన 2 జూన్ 2014 తరువాత ఆంధ్రప్రదేశ్లో జీవో ఎంఎస్ నెంబర్ 28 తేదీ 13 2019 ప్రకారం నోషనల్ ఇంక్రిమెంట్లు ఇచ్చి పెన్షనర్లకు ఆర్థికలబ్ది వర్తింపజేసినారు. కానీ తెలంగాణలో గత ప్రభుత్వం ఇస్తామని హామీ ఇచ్చి ఇవ్వలేదు. ప్రస్తుత ప్రభుత్వముకు కూ డా 398 స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇ వ్వాలని ప్రాతినిధ్యం చేయడం జరిగింది. కానీ నోషనల్ ఇంక్రిమెంట్ల విషయములో ఇప్పటివరకు స్పం దించలేదన్నారు.ప్రస్తుతము తెలంగాణలో ఉన్న అన్ని ఉపాధ్యాయ సంఘాల దృష్టికి తీసుకుపోయినప్పటికిని ఆ సంఘాలలో ఎలాంటి స్పందనలు లేవు. ఏ ఉపాధ్యాయ సంఘం కూడా పట్టించుకోవడం లేదు. మొక్కుబడిగా డిమాండ్ల లో పెడుతున్నారు కానీ పట్టించుకోవడం లేదు. ప్రస్తుత సందర్భంలో ఈ ఏకై క డిమాండ్ సాధనతో పోటీచేస్తున్నట్లు ప్రకటించారు.

## హన్యానాయక్‌కు లెజెండరీ వరల్డ్ లీడర్‌షిప్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అంతర్జాతీయ అమెరికన్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ వారు లెజెండర్ వరల్డ్ లీడర్‌షిప్ అవార్డును విద్య, వైద్యం, సమాజ సేవలకు గుర్తింపుగా మిర్యాలగూడకు చెందిన ఫెయిత్ బంజారా ఆశ్రమ నిర్వాహకుడు, సామాజిక వేత్త ధీరావత్ హన్యానాయక్ అందుకున్నారు. తమిళనాడులోని తిరుచనపల్లిలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమంలో ప్రముఖుల చేతులమీదుగా ఆయన అవార్డును, భారత ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ప్రశంసపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భగా ఆయన సంస్థ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలి

**ప్రజాపక్షం/వలిగొండ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో ఈనెల తొమ్మిదవ తేదీ నుండి 26/11/2024 వరకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఓ డి.జితేందర్ రెడ్డి తెలిపారు. సర్వే సుమారుగా పూర్తి కావస్తుందని అన్నారు. ఇందులో భాగంగా మండలంలోని గ్రామపంచాయతీలలో ఆవాస ప్రాంతాల్లో ఎవరైనా సర్వే నిర్వహణకు సంబంధించిన అధికారులు మీ వద్దకు రాకున్నా ,అదేవిధంగా మీరు అందుబాటులో లేకపోవడం లేదా మీ ఇంటికి తాళం వేసి ఉన్న సందర్భంలో గానీ సర్వేలో నమోదు కానీ కుటుంబాల వారు 100 శాతం నమోదు కొరకు అందరు కూడా సహకరించాలని తెలిపారు. ఇంకా సర్వేలో నమోదు చేసుకోనటువంటి కుటుంబాలు సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శి, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నోడల్ అధికారి/ మండల పరిషత్ అభివృద్ధి అధికారికిఫోన్ (పర్యవేక్షకుడి ఫోన్ నెంబర్ 8686958899) ద్వారా లేదా ప్రత్యక్షంగా సంప్రదించి మీ కుటుంబాన్ని సర్వేలో నమోదు చేయించుకోవాల్సిందిగా ఎంపీడీవో డి.జితేందర్ రెడ్డి కోరారు.

## సమగ్ర ఇంటింటి సర్వే పూర్తికి సహకరించాలి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** సమగ్ర ఇంటింటి సర్వే పూర్తయిందని ఏదైనా కారణాలవల్ల సర్వే వివరాలు నమోదు చేసుకోని వ్యక్తులు సహకరించి ఫోన్ ద్వారా లేదా ప్రత్యక్షంగా గ్రామ పంచాయతీలలో సంప్రదించి సర్వే100 శాతానికి సహకరించాలని ఎండిఓ రాపర్తి భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల తొమ్మిదో తేదీన ప్రారంభించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పోచంపల్లి మండలంలో పూర్తయినట్లు మొత్తం 75 మంది ఎన్యుమరేటర్లు 10800 ఇళ్లను సందర్శించి ఆయా కుటుంబాలకు సంబంధించి సమగ్రంగా సామాజిక ఆర్థిక ఉపాధి విద్యా రాజకీయ, కుల వివరాలకు సంబంధించినటువంటి అన్ని గణాంకాలను సేకరించడం జరిగినట్లు వివరాలు వెల్లడించారు. సమగ్ర సర్వే సుమారుగా 98 శాతం పూర్తయిందని. మిగిలిన కుటుంబాలు ఎవరైనా దయచేసి సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శికి లేదా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నోడల్ అధికారి/మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం 9505406757 ఫోన్ నంబర్ ద్వారా లేదా ప్రత్యక్షంగా గ్రామపంచాయతీ కార్యాలయం సంప్రదించి తమ కుటుంబాన్ని సమగ్ర సర్వేలో నమోదు చేయించుకోవాల్సిందిగా కోరారు.

## దేవాదుల కాల్వ ప్రాజెక్టుకు భూ సేకరణ పరిశీలన




**ప్రజాపక్షం/తిరుమలగిరి:** మండలంలోని 10ఆర్ తిరుమలగిరి 11ఆర్, మాలిపురం దేవాదుల కాల్వ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణను సోమవారం ఆర్డీవో ఆర్.వేణుగోపాలరావు పరిశీలించారు. భూసేకరణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బి.హరిప్రసాద్, ఇరిగేషన్ డిఇ శ్రీకాంత్‌శర్మ, ఈఈ కమాలాకర్, ఆర్ఐ మగ్దుం బాబా, సర్వేయర్ అలెన్‌జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల అభివృద్ధికి 'ధర్తి అబ' కార్యక్రమం

**ప్రజాపక్షం/దేవరకొండ:** గిరిజన సాధికారత కొరకై ధర్తి అబ కార్యక్రమం గొప్ప ఉద్దేశ్యంతో గిరిజనుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేయబడిన పథకం అని గిరిజనులు ఈ పథకాన్ని అన్ని విధాలుగా ఉపయోగించుకోవాలని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని మైనంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ధర్తి అబ గ్రామ సభలో ఎంఎల్ఏ బాలు నాయక్ పాల్గొన్నారు. గ్రామ ప్రజలు కోలాట ప్రదర్శనతో స్వాగతం పలికారు. గిరిజనులకు సరైన మౌలిక సదుపాయాలు రహదారులు, నీరు, ఆరోగ్యం, విద్య, టెలికాం, విద్యుత్, గృహ నిర్మాణం వంటి కనీస సౌకర్యాల కల్పన కోసం ఈ పథకం ప్రారంభించారని ఎంఎల్ఏ తెలిపారు. ఈ పథకాన్ని మైనంపల్లి గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గిరిజన తండాల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైనంపల్లి గ్రామ మాజీ ఎంపిటిసి కొర్ర గౌతమిరాంసింగ్, సీత్య, పాండు, అంజయ్య, వెంకటయ్య, సేవ్య, రమేష్, ఏటిడబ్ల్యూవో శ్రీనివాస్, సూపర్‌వైజర్ దేవి, నాయక్, ఎంపిడివో డానియల్, తహశీల్దార్ సంతోష్‌కిరణ్, ఏవో రవి, ఐసిడిఎస్ సిడిపివో సూపర్ వైజర్ విజయలక్ష్మి, పంచాయతీ రాజ్ డిఈ లింగారెడ్డి, ఏఈ శంకర్, పంచాయతీ సెక్రటరీలు సమ్రిన్, సరిత, స్వాతి, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.





## రూ. 25వేలు ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/ మర్రిగూడ:** యరగండ్లపల్లి గ్రామములో మహిళలు కోలాటాలు నేర్చుకునేందుకు సోమవారం ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు *పులిమామిడి నరసింహారెడ్డిని ఏడుదొడ్ల కృష్ణా రెడ్డి ని కాల గజ్జులు ఇప్పించాలని కోరారు.అడిగిన వెంటనే వారికి రూ25వేలు అందజేశారు.ఈ సందర్భంగా పులిమామిడి నరసింహా రెడ్డి. ఏడుదోడ్ల కృష్ణ రెడ్డిలు మాట్లాడుతూ యరగండ్లపల్లి గ్రామంలో మహిళలు కోలాటాలు నేర్చుకోవడం మాకు చాలా ఆనందంగా ఉందని మహిళలు ఇంకా అనేక కార్యక్రమాలలో రాణించాలని సూచించారు.యరగండ్లపల్లి గ్రామంలో మహిళలను ప్రోత్సహించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం దాతలకు కోలాటాల బృందం. ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపి శాలువ తో సత్కరించారు.

## విద్యార్థి దశనుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఏర్పరుచుకోవాలి

**ప్రజాపక్షం/భువనగిరి:** విద్యార్థి దశనుంచే ట్రాఫిక్ నిబంధనల పై అవగాహన ఏర్పరుచుకోవాలని భువనగిరి ట్రాఫిక్ ఎస్ఐ విజయ కృష్ణ తెలిపారు. భువనగిరి పట్టణంలో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనల పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రాఫిక్ ఎస్ఐ విజయ కృష్ణ మాట్లాడుతూ మైనర్ బాలికలు, బాలురు వాహనాలను నడుపవద్దని తెలిపారు. వారి తల్లిదండ్రులు వారికి వాహనాలు ఇస్తే వారిపై చట్ట ప్రకారమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపవద్దని, ద్విచక్ర వాహనాలను హెల్మెట్ లేకుండా, కారును సీట్ బెల్టు లేకుండా నడవపద్దని సూచించారు. అతి వేగంతో వాహనం నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పెద్దన్న, డీన్ సార్ శేఖర్, ఎంజిఎం వెంకట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

**ప్రజాపక్షం/చండూరు:** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వాటిని ప్రతి ఒక్కరు వినియోగించుకొని విజ్ఞానవంతులు అవ్వాలని నల్లగొండ డిఎస్పి శివరాంరెడ్డి , అసిస్టెంట్ డిఎంహెచ్ఓ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తుమ్మలపల్లి లో గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగుల ఆద్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే గ్రంధాలయాన్ని డిఎస్పి శివరాంరెడ్డి ,డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ,ఎంఈఓ సుధాకర్‌రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని గ్రంధాలయాలను విద్యార్థులు ,పాఠకులు , నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రంధాలయ ఏర్పాటుకు భవనాన్ని ఏర్పాటు చేసిన రామలింగారెడ్డి , గ్రంధాలయానికి పుస్తకాలు అందించిన ఎత్తపు మధుసుధన్ రావు ను ఈ సందర్భంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ ప్రతీక్‌రెడ్డి జూనియర్ కళాశాల అధ్యాపకులు కురుపాటి శివకోటి , భూతరాజు యాదయ్య, ఎస్.బిక్షపతి, నర్సింహ్మా, బొడ్డు యాదయ్య ,బోయపల్లి రాజు, జర్నలిస్టు రవి, డీలర్ యాదయ్య, రవీందర్, సత్యనారాయణ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



## మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలి



**ప్రజాపక్షం/ హాలియా:** మార్కెట్ కమిటీలు రైతులు అవసరాలకు అనుగుణంగా పనిచేయాలని సాగర్ ఎమ్మెల్యే కుందూరు రెడ్డి అన్నారు. హాలియా మార్కెట్ కమిటీ ఏర్పాటైన తర్వాత సోమవారం నిర్వహించిన మొదటి పాలక మండలి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న గిట్టుబాటు ధరలు మార్కెట్ ద్వారా రైతులు పొందాలని అందుకు పాలకమండలి సభ్యులు కృషి చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల పంటలకు ఇస్తున్న గిట్టుబాటు ధర మార్కెట్ల ద్వారా రైతులు పొందాలని సూచించారు. హాలియా మార్కెట్, దాని పరిధిలో ఉన్న సబ్ మార్కెట్ యార్డుల అభివృద్ధికి ఐదు కోట్ల రూపాయలతో వివిధ రకాల పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే చెప్పారు. హాలియా మార్కెట్ కమిటీ లో కందుల కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తిరుమలగిరి సబ్ మార్కెట్ యార్డ్ నుండి తెట్టెకుంట వరకూ రహదారి ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మున్సిపల్ చైర్ పర్సన్ ఎడవల్లి అనుపమ నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ సెక్రటరీ వెంకట్ రెడ్డి, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కెటిఆర్‌కు ఘన స్వాగతం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** మహబూబాబాద్ మానుకోట వేదికగా లగచర్ల దళిత గిరిజన రైతుల పక్షాన నిలిచి ధర్నాలో పాల్గొని నిరసన తెలిపేందుకు వెళ్లిన బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హైదరాబాదు నుంచి వెళ్లే క్రమంలో పోచంపల్లి సమీపాన ఉన్న కొత్తగూడెంలోని ప్రధాన నేషనల్ హైవే వద్ద సోమవారం ఆపార్టీ ఉమ్మడి నల్లగొండ జిల్లా నియోజకవర్గాల మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనుకున్న సమయానికే కొత్తగూడెం చేరుకొని కాసేపు ఆగారు.మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి,ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి చింతల వెంకటేశ్వర్ రెడ్డిలు స్వాగతం పలుకుతూ శాలువాలతో ఘనంగా సన్మానించారు. పెద్ద ఎత్తున గులాబీ పార్టీ అభిమానులు కేటీఆర్ తో కరచాలనం చేయడానికి ఎగబడ్డారు.అందరికీ అభివాదం చేశారు.

### కెటిఆర్‌కు ఘనస్వాగతం పలికిన చిరుమర్తి



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి , సిరిసిల్ల శాసన సభ్యులు కల్వకుంట్ల తారక రామారావుకి నార్కట్ పల్లి వద్ద నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఘనంగా స్వాగతం పలికారు. సోమవారం మహబూ బాబాద్ రైతు ధర్నా కార్యక్రమానికి వెళ్తుండగా చిట్యాల నకిరేకల్ లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో కేటీఆర్ కి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం లో జిల్లా గ్రంథాలయం మాజీ చైర్మన్ రెగట్టే మల్లికార్జున్ రెడ్డి, నార్కట్ పల్లి మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్ రెడ్డి, బిఆర్ఎస్ శ్రేణులు తదితరులు ఉన్నారు.

## రక్తశాతాన్ని పెంచే కూరగాయలు తీసుకోవాలి

**ప్రజా పక్షం/ నల్లగొండ టౌన్:** అంతర్జాతీయ మహిళలు హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని ఆర్ పి రోడ్ లో గల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, అదేవిధంగా బాలికల పాఠశాల, బోయవాడ లోని బాలికల ప్రైమరీ స్కూల్ ,హై స్కూల్ ,మాన్ ఫోర్ట్ స్కూల్ బాలికలకు, అదేవిధంగా సెంట్ ఆల్ఫోన్సస్ స్కూల్లోని బాలికలకు దాదాపు 30 వేల రూపాయల విలువగల శానిటరీ పాడ్స్ ను అందజేశారు,ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ అనితరాణి మాట్లాడుతూ తాము చేస్తున్నటువంటి అనేక సేవా కార్యక్రమంలో భాగంగా స్కూళ్లలో, కాలేజీల్లో, ముఖ్యంగా పేదరికం నుంచి వచ్చినటువంటి బాలికలు ఎదుర్కొనే సమస్యలకు గాను వాళ్లకు అవగాహన కల్పించి కొంత సహాయం చేయాలన్న ఉద్దేశంతో ఈ యొక్క శానిటరీ పాడ్స్ అందించడం జరిగినది అని చెప్పారు. వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ బాలికలు యవ్వన దశలో ముఖ్యంగా పీరియడ్స్ దశలో తగు జాగ్రత్తలు తీసుకొని, శానిటరీ పాడ్స్ ని ఎప్పటికప్పుడు మార్చుకుంటూ, తమ శరీరంలో రక్త శాతాన్ని పెంచే డైట్ ఆకుకూరలు, కూరగాయలు,పాలు,గుడ్డు తీసుకోవాలని చెప్పారు. మహిళలులలో వచ్చే గర్భకోశానికి సంబంధించిన వ్యాధుల గురించి వాటి వ్యాక్సిన్ గురించి కూడా బాలికలకు వివరించినారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుల్లారావు ప్రిన్సిపల్ సుధారాణి, పెంటయ్య, కిరణ్, సుజాత,హేమమాలిని, ఆనంద్, అనిత టీచర్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఎన్‌సిసి మెగా రక్తదాన శిబిరం

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** ఎన్‌సిసి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నాగార్జున ప్రభుత్వ కళాశాల ఎన్‌సిసి క్యాడేట్లు,రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నాగార్జున ప్రభుత్వ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ఎన్సిసి బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ లక్షారెడ్డి,నాగార్జున ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం ఒక మహత్తరమైన కృత్యం, ఇది జీవితాలను కాపాడగల సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు.